ప్రజాశక్తి

బుధవారం 22 అక్టోబర్ 2025 5 శ్రీ సత్యసాయి





అమరవీరుల స్థూపం వద్ద అధికారులు, నాయకుల నివాళి

ప్రజాస్వామ్యంలో పోలీసు వ్యవస్థ కీలకం : కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసు వ్యవస్థ కీలకమని కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, ఎస్పీ ఎస్ . సతీష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమరవీరుల స్మృతి పరేడ్ నిర్వహించారు. ముందుగా సాయుధ బలగాల నుండి కలెక్టర్, ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి అనంతరం ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో శాంతిభద్రతలు పరిరక్షించడంలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులలో విరోచితంగా పోరాడి అసువులు బాసిన పోలీసుల త్యాగాలు మరువలేనివని, వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, చేస్తున్నామని అన్నారు. పరాయి దేశం నుంచి శత్రు దుర్భిద్యాలు వల్ల యుద్ధం వస్తే సైనికులు ఏ విధంగా పోరాడుతారో అంతర్గత భద్రత కోసం పోలీసులు కూడా అదే విధంగా విధులు నిర్వర్తిస్తారని కొనియాడారు. నక్సలిజం, మాఫియా వంటి వాటిని నిర్మూలించడంలో కీలక పాత్ర పోలీసులదే అన్నారు. క్రమశిక్షణకు మారుపేరు పోలీస్ అన్నారు. అమరులైన పోలీసులకు ఘన నివాళులర్పిస్తున్నానని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అమరులైన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తించుకొని విధుల్లో పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం గురించి వివరించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అమరవీరులను పేరుపేరునా స్మరించుకోవడంతో పాటు వారి సేవలను గుర్తించి ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. శిబిరాలు పోలీసుల త్యాగాలు తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రాల ప్రదర్శనలు తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం అమర పోలీసులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కారుణ్య నియామకం పత్రాలు , చెక్కు అందజేత : పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద హోంగార్డులుగా నియమిస్తూ వారి కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ ,ఎస్పీ నియామక పత్రాలను అందజేశారు. పోలీసు అమర వీరుల కుటుంబాలలో ఏవైనా సమస్యలున్నా, తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ తో పాటు, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ,మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, ఆర్డీవో సువర్ణ , ఏవో సుజాత , ఏఆర్ శ్రీనివాసులు , డీఎస్పీలు విజయకుమార్, నరసింగప్ప, హేమంత్ కుమార్, ఆదినారాయణ, ఎస్బి సిఐ వెంకటేశ్వర్లు , ఆర్ఐ వలి, మహేష్, రవికుమార్,రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం సభ్యులు సూర్యకుమార్, సిఐలు సురేష్, శ్రీనివాసులు , శివాంజనేయులు , ఆర్ఎస్ఐలు వీరన్న ,వెంకటేశ్వర్లు ,ప్రదీప్ సింగ్, ప్రసాద్ , పోలీస్ కుటుంబాలు, సిబ్బంది పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు యోధుల త్యాగాలు మరువలేనివి : ఎమ్మెల్యే

కొత్తచెరువు రూరల్: పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,జిల్లా కలెక్టర్,ఎస్పీ ,పోలీస్ అమరవీరుల కుటుంబాలు, పోలీస్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పోలీస్ యోధుల సేవలు, త్యాగాలు మరువలేనివని అన్నారు.

హిందూపురం : దేశ భద్రత, సమాజ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరంకితమవుదామని డిఎస్పి మహేష్ అన్నారు. అమరవీరుల దినోత్సవాన్ని పురష్కరించుకోని మంగళవారం పట్టణంలో రహమత్‌పురంలో ఏర్పాటు చేసినా అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల వేషదారణలో చిన్నారులతో కలిసి పోలీసులు పట్టణంలోని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజినేయులు, జనర్దాన్, ఎస్ఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త పాలన

- ఒకే భవనంలో మూడు సచివాలయాలు
- గోడౌన్‌ను తలపిస్తున్న కార్యాలయాలు
- సమయానికి రాని సిబ్బంది
- శృతి మించిన అధికార పార్టీ నాయకుల జోక్యం



మూడు సచివాలయాలు ఉన్న భవనం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని నాగలకట్ట కాలనీకి చెందిన దుర్గాదేవికి ఇంతవరకు స్మార్ట్ రేషన్ కార్డు అందలేదు. సచివాలయ సిబ్బంది ఇంటివద్దకే వచ్చి ఇస్తారని ఇన్ని రోజులు ఎదురు చూసింది. వారు రాలేదు. సచివాలయం వెనక భాగంలోనే ఈమె ఉంటున్న కాలనీ ఉంది. అయినప్పటికీ సిబ్బంది వెళ్లి స్మార్ట్ కార్డ్ ఇవ్వలేదు. స్మార్ట్ రేషన్ కార్డు కోసం సచివాలయం వద్దకు వచ్చింది. ఆమె వార్డు సచివాలయానికి సంబంధించిన సిబ్బంది లేరు. ఎవరిని అడగాలో తెలియని గందరగోళం.

పట్టణంలో 3వ సచివాలయ పరిధిలోని మారుతీనగర్‌లో వెంకటరాముడు ఉంటున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులో వారి అమ్మాయి పుట్టిన తేదీ తప్పుగా ముద్రించారు. వాటిని సరి చేయడానికి సచివాలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్నాడు. సచివాలయ సిబ్బంది అతనికి సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. స్మార్ట్ రేషన్ కార్డులో తప్పులుంటే సచివాలయాల్లో మార్పులు చేసుకోవాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు చెబుతుంటే సచివాలయ సిబ్బంది మాత్రం తమకు తెలియదని చెబుతున్నారు.

ఇలా వీరిద్దరే కాదు. జిల్లాలో ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో వారంతా పథకాలకు దూరమయ్యారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రజల ముంగిటికే పాలన! అంటూ వైసీపీ సర్కారు వచ్చీ రాగానే 'ఇదో విప్లవం' అంటూ గ్రామ, వార్డు సచివాలయాలను ప్రారంభించింది. ప్రస్తుతం అంతా అయోమయం...ఎవరు వస్తారో.. ఏం పని చేస్తారో.. ఎక్కడ చేస్తారో తెలియని గందరగోళం నెలకొంది. సమస్యలపై వచ్చిన ప్రజలపట్ల పలువురు సచివాలయ సిబ్బంది అమర్యాదగా ప్రవర్తించి సరైన సమాధానం చెప్పకుండా అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొందరు హాజరు పుస్తకంలో సంతకాలు చేసి సొంత పనులకు బయటకు వెళుతుంటే మరి కొందరు అసలు హాజరు పట్టికలో సంతకాలే చేయడం లేదు..విధుల్లో ఉన్నారో లేదో తెలియడం లేదు. ఒక్కో సచివాలయంలో సగటున పదిమంది సిబ్బంది విధులు నిర్వహించాల్సుంది. కొన్ని సచివాలయాల్లో కేవలం ఇద్దరు మాత్రమే కార్యాలయాల్లో ఉంటూ పనులు చేస్తున్నారు. మిగిలిన వారు ఎక్కడున్నారో? ఏమైపోయారో తెలియని పరిస్థితి. సచివాలయాలను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు అంతంతమాత్రంగా పర్యవేక్షించడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ఒకే భవనంలో మూడు సచివాలయాలు

పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలో ఏడు సచివాలయాలు ఉన్నాయి. అందులో వెంకటరెడ్డి పల్లి, కోనాపురంలో ఒక్కొక్కటి ఉన్నాయి. మిగిలిన 5 సచివాలయాలు పట్టణంలో ఉన్నాయి. 3,4,5 సచివాలయాలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ఆవరణలో అసంపూర్తిగా ఉన్న భవనంలో ఉన్నాయి. ఒకటి, రెండు సచివాలయాలు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అధికారులు ఏర్పాటు చేశారు. ఇక మూడు, నాలుగు, ఐదు సచివాలయాలు ఒకే చోట ఉండడంతో సమస్యలపై వచ్చే ప్రజలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. సిబ్బందిని అడిగితే సరైన సమాధానం చెప్పకుండా ప్రజల పట్ల విసుక్కుంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

గోడౌన్‌లా సచివాలయం

మూడు సచివాలయాలు ఒకే చోట ఉండడంతో అందులో సిబ్బంది సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలో టేబుళ్లు కుర్చీలు ఇతర సామాగ్రి ఎక్కడబడితే అక్కడ వేసి గోడౌన్‌గా మార్చివేశారు. కంప్యూటర్లను మూలకు వేశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఎక్కడబడితే అక్కడ పారవేశారు. కార్యాలయం చూస్తే గోడౌన్ కంటే అధ్వానంగా మారిపోయింది.

ఖాళీగా ఉద్యోగులు.. విధులకు పలువురు డుమ్మా

ఒక్కో సచివాలయంలో సగటున పది మంది సిబ్బంది ఉన్నారు. ఎవరు ఏం చేస్తారో తెలియదు. ప్రతి సచివాలయానికీ ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్! కానీ పల్లెల్లో పనులే జరగనప్పుడు ఇంజనీరింగ్ అసిస్టెంట్ చేసేదేమిటి? ప్రతి సచివాలయంలో ఒక ఎనర్జీ అసిస్టెంట్! విద్యుత్ శాఖలో లైన్‌మెన్ ఉండగా ఎనర్జీ అసిస్టెంట్ ఏం చేస్తారో అర్థం కాదు. ఇర థర్మామీటర్, బీపీ చూసే యంత్రం లేకుండా ఏం చేయాలో హెల్త్ అసిస్టెంట్లకు అర్థం కావడంలేదు. 540 సేవలు అందిస్తున్నామంటూ సర్కారు గొప్పగా చెప్పడమే తప్ప పదుల సంఖ్యలోనూ సేవలు అందడంలేదు. చాలాచోట్ల సచివాలయాలకు సొంత భవనాలు లేవు. కొన్ని చోట్ల అసంపూర్తి నిర్మాణాల భవనాలలో సచివాలయాలను నడుపుతున్నారు.

కొందరు ఉద్యోగులు హాజరైనట్లు సంతకాలు చేసి తర్వాత సచివాలయంలో ఉండకుండా సొంత పనులపై బయటకు వెళ్లిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. పేరుకు సచివాలయాల ఉద్యోగులే దాదాపు నలుగురు సిబ్బంది మాతృశాఖ ఆధీనంలోనే పనిచేస్తున్నారు. విద్యుత్, వ్యవసాయం, ఏఎన్ఎమ్, ఫిషరీస్, వ్యవసాయ, హార్టికల్చర్, రెవిన్యూ సర్వే శాఖల ఉద్యోగులు ఆయా శాఖల్లోనే విధులు నిర్వహిస్తున్నారు.

ఖాళీగా సిబ్బంది..

ప్రస్తుతం అటెండెన్స్ పడగానే సచివాలయ కార్యదర్శులంతా ఆఫీసు వదిలి వెళ్లిపోతున్నారు. తిరిగి సాయంత్రం సచివాలయానికి చేరుకొని హాజరు వేసుకొని పిచ్చాపాటి మాట్లాడుకొంటూ కూర్చుంటున్నారు. 11మంది కార్యదర్శుల్లో ఒకరిద్దరు మాత్రమే ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేస్తూ కనిపిస్తున్నారు. మిగిలిన వారంతా ఖాళీగానే ఉంటున్నారు. ఇక ఉదయం 11 గంటలు దాటుతున్నా చాలా సచివాలయాల్లో సిబ్బంది జాడ కనిపించడం లేదు. కొందరు మాత్రమే విధులకు హాజరవుతుండగా, మరికొందరు ఫీల్డ్ విజిట్లకు వెళ్లారని, ఇంకొందరు సెలవులో ఉన్నారని చెబుతున్నారు. అయితే ఈ వివరాలను మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో పొందుపరచడం లేదు. వ్యవసాయ సిబ్బంది రైతు భరోసా కేంద్రాలకు పరిమితమవుతున్నారు. ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు కార్యాలయాల్లో ఉద్యోగులు లేక ఖాళీ సీట్లు దర్శనమిస్తున్నాయి. ఇక సచివాలయాల్లో సగానికి పైగా సీట్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. సిబ్బందిలో అత్యధికులు ఫీల్డ్‌లో ఉన్నారని చెబుతున్నారు. ఇళ్ల లబ్ధిదారుల వెరిఫికేషన్ కోసం వార్డుల్లో పర్యటిస్తున్నారని పేర్కొంటున్నారు. సచివాలయం అడ్మిన్ సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రటరీ మాత్రమే కార్యాలయంలో ఉంటున్నారు. శానిటేషన్ కార్యదర్శులను నియమించినప్పటి నుంచి ఇప్పటి వరకు వారు చేయాల్సిన ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్స్, మ్యారేజీ రిజిస్ట్రేషన్స్, పెట్ డాగ్స్ కంట్రోల్ తదితర బాధ్యతలను నిర్వహించడంలేదు. క్షేత్ర స్థాయిలో శానిటరీ వర్కర్లు, మేస్త్రీలు చేయాల్సిన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆదాయం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఈడబ్ల్యూఎస్, రెవెన్యూకి సంబంధించిన దరఖాస్తుల కోసం మాత్రమే ప్రజలు సచివాలయానికి వస్తున్నారు.

శృతి మించిన అధికార పార్టీ నేతల జోక్యం

సచివాలయాల్లో అధికార పార్టీ స్థానిక నాయకుల జోక్యం శృతి మించింది. కొన్నిచోట్ల టిడిపి నాయకులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ సచివాలయాల్లోనే తిష్ట వేస్తున్నారు. తమ పార్టీ మద్దతుదారులు వస్తే వెంటనే పని చేయిస్తున్నారు. అనేక సచివాలయాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది.



సిబ్బందిలేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

తిరిగి తిరిగి విసిగిపోయా



వారం పది రోజుల నుంచి స్మార్ట్ రేషన్ కార్డు కోసం తిరుగుతున్నా. షాప్ నెంబర్ 30 నాలుగో సచివాలయంలో ఇస్తారన్నారు. అక్కడికి పోతే నాలుగులో లేదు మూడులో చూడండి అన్నారు. మూడులోకి వెళ్తే అక్కడ లేదన్నారు. మరి ఎక్కడుందో తెలియడం లేదు. జిల్లా అధికారులు స్పందించి లబ్ధిదారులకు ఇంటి వద్దకే స్మార్ట్ రేషన్ కార్డులను అందించాలి.

బాబావలి,
పెనుకొండ

సిబ్బందికి షోకాజ్ నోటీసులు



హాజరు పుస్తకంలో సంతకాలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇబ్బందికి షోకాజ్ నోటీసులు అందిస్తున్నాం. సంతకాలు చేసి మూమెంట్ రిజిస్టర్ లో నమోదు చేయకుండా వెళ్లిన వారి పై చర్యలు తీసుకుంటాం. విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

సతీష్ కుమార్,
నగరపాలక సంఘం కమిషనర్

అమెరికా పెంచిన సుంకాలను విరమించుకోవాలి : సిఐటియు



ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

అమెరికా భారత్‌పై విధించిన సుంకాలను విరమించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ లో నాయకులు నిరసన తెలిపి, ట్రంప్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జెడ్ పి శ్రీనివాసులు మాట్లాడుతు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎగుమతి చేసే వస్తువుల్లో పైన ఉత్పత్తుల పైన అధిక శాతం సుఖాలను విధించడం దుర్మార్గమైన చర్య అని విర్శించారు. ప్రపంచ దేశాలను శాసిస్తూ పెత్తందారి తనం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంలో కూడా విషం కక్కుతున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ విఆర్ రాము, ఫ్రీకార్ట్ బి స్పిన్నింగ్ మిల్ యూనియన్ ట్రెజరర్ నందీశ్వర, నాయకులు లక్ష్మయ్య, బైలప్ప, మారుతి, పరిగి మండలం సిఐటియు కన్వీనర్ శివకుమార్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధారెడ్డి, సిఐటియు హిందూపురం పట్టణ కో కన్వీనర్ రామకృష్ణ, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌తో స్కాన్ చేశాకే మద్యం విక్రయాలు

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ప్రజాశక్తి-హిందూపురం

ఏపీ ఎక్సైజ్ శాఖ రూపొందించిన సురక్షా యాప్ ద్వారా బార్ కోడ్ ను స్కాన్ చేసిన తర్వాతే మద్యం విక్రయాలు జరపాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య బార్ అండ్ రెస్టారెంట్స్, మద్యం దుకాణదారులకు సూచించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఏఈఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శ్రీరామ్ ఆద్వర్యంలో మంగళవారం పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్స్, మద్యం దుకాణాల్లో తనఖీలు నిర్వహించి, అమ్మకాలకు ఉన్న మద్యాన్ని సూరక్ష యాప్ ద్వారా స్కాన్ చేసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతు కల్తీ మద్యాన్ని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏపి ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్ ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి మద్యం సీసా స్కాన్ చేసిన తరువాత విక్రయాలు చేయాలన్నారు. మద్యం కొనుగోలు దారులు ఖచ్చితంగా ఏపి ఎక్సైజ్ సురక్ష యాప్ ను డౌన్‌లోడ్ చేసుకొని వారి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. కల్తీ మద్యాన్ని విక్రయించిన, తయారు చేసిన వారిపై పిడి యాక్టు కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ లక్ష్మి దుర్గయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లెక్క తప్పిన లెక్కల మాస్టారుపై చర్యలేవీ..?

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేసే ఉపేంద్ర ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా సొంతంగా ఆర్ఎన్ఎస్ పేరుతో యాప్ సృష్టించి, యూట్యూబ్‌లో పాఠాలు నిర్వహిస్తున్నా ఆయనపై చర్యలు తీసుకోవటంలో మీనమేషాలు లెక్కిస్తున్న అధికారుల వైఖరిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన వీడియోలు తీసి, ప్రతి వీడియోకు ఒక ధర నిర్మించి యాప్ లో అప్లోడ్ చేస్తాడు. యాప్ ద్వారా కోచింగ్ క్లాసులు నడిపి, పుస్తకాలను ప్రచారం చేయడం, విద్యార్థులు, తల్లిదండ్రుల ఆగ్రహానికి గురిచేస్తోంది. వీడియోలు, యాప్ ద్వారా కోచింగ్, పుస్తకాల ప్రచారం వంటి అంశాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాక్ష్యాలు ఉన్నా ఎందుకు చర్యలు లేవు? అని ప్రశ్నిస్తున్నారు. లెక్కల మాస్టారు వైఖరిపై శనివారం ప్రజాశక్తిలో కథనం వెలువడిన తర్వాత, ఉపేంద్ర తన యాప్, యూట్యూబ్‌లో కొన్ని వీడియోలను ఎవరికీ కనిపించకుండా ప్రైవేట్ చేశాడు. దీంతో పాటు, ఆర్ఎన్ఎస్ యాప్‌లో అమౌంట్ చెల్లించి క్లాసులు వినే విద్యార్థులకు నోటిఫికేషన్ ద్వారా యాప్‌లో టెక్నికల్ ఇష్యూ వల్ల కొన్ని వీడియోలు ప్రైవేట్‌లోకి వెళ్లాయని సాయంత్రానికి సమస్య పరిష్కరించబడుతుందని అన్ని వీడియోలు తిరిగి ఓపెన్ అవుతాయని చెప్పుకొచ్చాడు. వేల రూపాయల వేతనం తీసుకుంటూ ఆర్ఎన్ఎస్ యాప్, యూట్యూబ్‌లో స్టార్‌గా మారిన మాస్టారు ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు , విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడిపై విద్యాశాఖ ఎందుకు నోరుమెదపడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. యాప్‌ల ద్వారా స్వప్రచారం చేసుకుంటుంటే అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉంటే విద్యా ప్రమాణాలు ఏం అవుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వేతనం పొందే ఎవరైనా ఏ విధంగా ఉండాలన్న విషయంపై ఓ స్పష్టమైన నియమావళి ఉంది. మరీ ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు సంబంధించి ప్రైవేట్ బోధన చేయడం శిక్షార్హం. మరి సివిల్ కండక్ట్ రూల్స్ అతిక్రమించి బోధన చేయడంతో పాటు యాప్ సృష్టించి, యూట్యూబ్ లో పాఠాలు ప్రచారం చేయడం విరుద్ధం. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తూ ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి-హిందూపురం




వివరాలను వెల్లడిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం కమిషనర్ మల్లికార్జున తన చాంబర్‌లో ఎసిపి ఎం. చంద్రమ్మ, టిపిఓ అబ్దుల్ సత్తార్ లతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. హిందూపురం పురపాలక సంఘ పరిధిలో దాదాపు 300 వరకు అనధికార లేఅవుట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ కోసం 56 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయా యజమానులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనధికార లేఅవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. వాటికి సంబంధించిన అర్హత 30-06-2025 లోపు రిజిస్టర్ అయిన ప్లాట్లు మాత్రమే రెగ్యులరైజ్ కు అర్హులు అవుతారని, లేఅవుట్ లో కనీసం ఒక ప్లాట్ అప్పటికే క్రయవిక్రయాలు జరిగినట్లు ఉండాలని సూచించారు. అనధికార లేఅవుట్లు, పాట్లు యజమానులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకొని అన్ని ఫీజులు చెల్లిస్తే 10 శాతం రాయితీ ఇవ్వడంతో పాటు ఓపన్ స్పేస్, సిఎల్ యు చార్జీలపై వర్తించదన్నారు. ఓపేన్ స్పేస్ అందుబాటులో లేక పోతే 50 శాతం రాయితీతో చెల్లించాల్సిన 14శాతంలో 7శాతం మాత్రమే చెల్లించాలన్నారు. వీటితో పాటు మరీన్ని రాయితీలను ప్రభుత్వం కల్పించిందన్నారు. అనుమతులు లేని లే అవుట్‌లో ఉన్నా ఇంటి స్థలాల్లో జరిగే నిర్మాణాలకు పురపాలక సంఘం తరపున ఎటువంటి అనుమతులు ఇవ్వడం జరగదన్నారు. దీంతో పాటు అలాంటి వారిపై పురపాలక చట్టం మేరకు కఠిన చర్యలను యతీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వీటికి సంబంధించిన పూర్తి సమాచారం కోసం మున్సిపల్ కార్యాలయం లోని పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ను సంప్రదించాలని కమిషనర్ వివరించారు.

రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలను విజయవంతం చేద్దాం

ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా కలెక్టర్లు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాలో నవంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు - 2025ను సమిష్టిగా విజయవంతం చేద్దామని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఓ.ఆనంద్, ఏ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతికఉత్సవాలు - 2025పై సంబంధిత అధికారులతో ఇరు జిల్లాల కలెక్టర్లు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 7, 8, 9 తేదీల్లో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నగరంలోని ఆర్‌డిటి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల కోసం వసతి సదుపాయాలు, భోజనం, ఇతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఆర్డీటీ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని, ఏ జిల్లాల నుంచి ఎవరెవరు క్రీడాకారులు వస్తారన్నది ముందుగానే తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీనియర్ ఉన్నతాధికారులు వచ్చే అవకాశం ఉందని, డయాస్ ఏర్పాట్లు, ప్రోటాకాల్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల అధికారులు సమన్వయం చేసుకొని పని చేసి రెవెన్యూ క్రీడలను విజయవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. స్థానికంగా వసతి నుంచి క్రీడలు జరిగే ఆర్డీటీ స్టేడియానికి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీవోలు కేశవ నాయుడు, వసంత బాబు, ఏబీవీఎస్‌బి శ్రీనివాస్, ఆర్‌డిఒలు మహేష్, వివిఎస్.శర్మ, సువర్ణ, ఆనంద్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు, సెక్రటరీ సోమశేఖర్, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహశీల్దార్లు హరికుమార్, మోహన్ రావు, బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

బత్తలపల్లి : వివిధ నేరాలు, అంశాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు పోలీసులు చర్యలు చేపడు తున్నట్లు ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఎస్పీ మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అన్ని గదులు, లాకప్‌లు, సీసీ కెమెరాల పనితీరు, రికార్డులు, తదితర వాటిని పరిశీలిం చారు. సిబ్బందితో సమావేశమై వివిధ అంశాలను వివరించారు. నమోదవుతున్న వివిధ నేరాలపై విశదీకరించారు. మహిళల అదృశ్యం, ప్రేమపేరుతో వెళ్లిపోతున్న సంఘటనలపై ప్రజలకు అవగాహన కల్పించేం దుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగానే పోలీస్ స్టేషన్లను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదుల కదలికలపై కూడా విచారణ జరుగుతోందన్నారు. స్థానిక కూడలిలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, ట్రాఫిక్ సమస్యకు పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సమయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కేయిల్ వైర్లు, తదితర చోరీలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అంతకుముందు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ వెంట ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్, ట్రైనీ ఎస్ఐ ప్రసన్న, ఎఎస్ఐలు, పోలీసులు ఉన్నారు.

బాలుడికి పరామర్శ

తాడిమర్రి : మండలంలోని పిన్నదరి గ్రామానికి చెందిన మూడేళ్ల బాలుడు సాకే విగ్నేష్‌కు మంత్రి సత్యకుమార్‌యాదవ్ చొరవతో తిరుపతిలోని శ్రీపద్మావతి చిల్డ్రన్ హార్ట్ కేర్ సెంటర్‌లో గుండె సంబంధిత వ్యాధికి శస్త్రచికిత్స చేయించారు. బాలుడు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా మంగళవారం మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు పిన్నదరి వెళ్లి బాలుడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఫోన్ ద్వారా బాలుడు తల్లిదండ్రులతో మాట్లాడిన మంత్రి ఇకపై ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్నా తన దృష్టికి తీసుకు రావాలని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు రామ్మోహన్, చంద్ర, విశ్వనాథ్, కేశవనారాయణ, కిరణ్, రమేష్‌కుమార్, సదాశివ, రమణ, రాజు, శ్రీనివాసులు, వీరనారప్ప, రాజు ఉన్నారు.







కొత్తచెరువులో అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు.. ధర్మవరంలో.. గోరంట్లలో

అమెరికా సుంకాల పెంపుపై నిరసన

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టిబొమ్మలు దహనం

భారత ఎగుమతులు, దిగుమతులపై అమెరికా పెంచిన సుంకాలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా సిపిఎం, సిఐటియు, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, చేనేత సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను ఊరేగించి, దహనం చేశారు. సుంకాల పెంపు అంశంపై వెంటనే భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పందించాలని, పెంచిన సుంకాలను తగ్గించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అమెరికా పెంచిన సుంకాలకు వ్యతిరేకంగా సోమవారం పట్టణంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లా డుతూ భారత ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేయాలన్నా, అక్కడి ఉత్పత్తులను ఇండియాకు దిగుమతి చేసుకోవాలన్నా ట్రంప్ భారీగా సుంకాలు పెంచారన్నారు. ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోడీ పెదవి ఇప్పకపోవడం దౌర్భాగ్య మన్నారు. దీంతో రైతు సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపట్టార న్నారు. ఇకనైనా మోడీ స్పందించాలని, లేనిచో రాబోయే రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఆలకుంట మారుతి, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్.బాషా, సిఐటియు నాయకులు, చేనేత నాయకులు హరి, రవి, వెంకటరాముడు, నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్ : వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మామిళ్లకుంట క్రాస్ వద్ద కూడలిలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం, పాడి ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా 11 నుంచి 50 శాతానికి సుంకాలు పెంచడం వల్ల మన దేశంలో వ్యవసాయ రంగం దివాలా తీసి వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోయి వలస పోవాల్సి వస్తుందన్నారు. స్పిన్నింగ్ గవర్నమెంట్ పరిశ్రమలు మూతపడతాయన్నారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కనీసం ప్రశ్నించకపోవడం దేశ ప్రజలను అవమానించడమే అన్నారు. తక్షణమే అమెరికా సుంకాలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యురాలు రమాదేవి, సిఐటియు జిల్లా నాయకులు పెడపల్లి బాబావలి, పైపల్లి గంగాధర్, రామచంద్ర, కౌలు రైతు సంఘం నాయకులు కదిరప్ప, రైతు సంఘం నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు షబానా, షేక్ ఆజాం, గంగరత్న, ఆంజనేయులు, లక్ష్మీదేవి, భార్గవి, మున్నా, గౌరమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

గోరంట్ల : వ్యకాసం ఆధ్వర్యంలో పాలసముద్రంలోని సిపిఎం కాలనీలో ఇళ్ల స్థలాల సాధన కమిటీ కన్వీనర్ అంజలి అధ్యక్షతన అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వ్యకాసం జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా వెంకటేశులు మాట్లాడుతూ అమెరికా వైఖరితో వ్యవసాయం, టెక్స్‌టైల్ రంగాలతో పాటు, రాష్ట్రంలో గార్మెంట్స్, వ్యవసాయం, పట్టు, డైరీ ఫామ్స్, ఉద్యానవన, తదితర రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. ట్రంప్ కుట్రలు, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన ప్రయోజనాలను కాపాడే వైఖరి తీసుకొని అమెరికాపై ఒత్తిడి పెంచాలన్నారు. కార్యక్రమంలో ఇళ్ల స్థలాల సాధన కమిటీ నాయకులు ముత్యాలప్ప, నంజుండప్ప, మీసాల ఆంజనేయులు, అమ్మాజాన్, లక్ష్మీనరసమ్మ, రామాంజనమ్మ, వెంకటమ్మ, రత్నమ్మ, గంగమ్మ, అరుణ పాల్గొన్నారు.

సోమందేపల్లి : కెవిపిఎస్, సిఐటియు, చేనేత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మాబు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య మాట్లాడుతూ ట్రంప్, అమెరికా సామ్రాజ్యవాద విధానాలను ఎండట్టారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, కిష్ట, చేనేత సంఘం నాయకులు నాగరాజు, సంజీవప్ప, వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : ఎపి రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ప్ల కార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ట్రంప్ చిత్రపటాలను దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటి నాయకులు సాంబశివ, జగన్మోహన్, రామ్మోహన్, బాబ్‌జాన్, సుధాకర్, కృష్ణానాయక్, శివప్రసాద్, మహబూబ్‌బాషా, రైతు సంఘం నాయకులు సుధాకర్‌రెడ్డి, రామాసినాయక్, చంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు..



సోమందేపల్లిలో ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తూ ..

కూరగాయల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణ ప్రజల సౌకర్యార్థం పట్టణం నలువైపులా కూరగాయల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయా లని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్, ఆర్టీసీ డిఎం, ఎంపిడిఒ, తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి నుల భద్రత దృష్ట్యా పాఠశాల సమీపంలోని ట్యాక్సీ స్టాండ్‌ను మరో చోటికి మార్చాలన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న ట్యాక్సీ స్టాండ్‌ను కదిరి ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పట్టణానికి నలువైపులా కూరగాయల మార్కెట్‌లు ఉండేలా మున్సిపల్ స్థలాలను పరిశీలించి ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. ప్రజారోగ్యం దృష్ట్యా మార్కెట్ వ్యాపారులతో మాట్లాడి కొలిమి మార్కెట్ వద్ద జనవా సాల్లో ఉండే జంతు వధశాలను పట్టణ శివారులోకి మార్చాలని సూచించారు. సమావేశంలో ఆర్టీసీ డిఎం మైనుద్దీన్, పట్టణ సిఐ నారాయణరెడ్డి, ఎంఇఒ చిన్నికృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరజవానుకు నివాళి

ప్రజాశక్తి-గోరంట్ల

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని కల్లితండాలో స్థానిక పోలీసులు వీరజవాను మురళినాయక్ సమాధిని సందర్శించారు. ఈ సందర్భంగా సిఐ శేఖర్, ఎస్ఐలు రామచంద్ర, ఉమాదేవి సమాధిపై పూలు వేసి నివాళులర్పించారు. అలాగే మురళి నాయక్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.

వైసిపి నేత మృతికి నివాళి

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మోరుబాగల్ గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు గిరియప్ప కుమారుడు మెకానిక్ తిమ్మరాజు(40) అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మడకశిర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎస్ఎల్.ఈరలక్కప్ప మోరుబాగల్ గ్రామం వెళ్లి తిమ్మరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో సర్పంచి తిప్పేస్వామి, నాయకులు రామకృష్ణ హెగ్డే, గోవిందప్ప, బాబు, మంజునాథ్, సోమశేఖర్, దుర్గేష్ ఉన్నారు.

డిఎ జీవోలను సవరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి కూటమి ప్రభుత్వం విడుదల చేసిన డిఎ జీవోను తక్షణమే సవరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి ఆర్.రామకృష్ణనాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చర్చల సందర్భంలో కనీసం ప్రస్తావనకు రాని అంశాలను డిఎ జీవోల్లో ప్రస్తావించడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. డిఎ అరియర్స్‌ను ఉద్యోగ విరమణ అనంతరం చెల్లిస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. సిపిఎస్ ఉద్యోగుల అరియర్స్‌ను ప్రస్తావించకపోవడం సరికాదన్నారు. 4 డిఎలకు గానూ ఒక డిఎ మాత్రమే విడుదల చేసి అందులోనూ గందరగోళానికి గురిచేయడం తగదన్నారు. తక్షణమే జీవో-60, 61 సవరణ చేసి ఉద్యోగులకు డిఎ అరియర్స్, సిపిఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు తక్షణం నగదు రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జింకా హరికృష్ణ, సాయి గణేష్, నాయకులు లక్ష్మయ్య, హెచ్.రామాంజనేయులు, నాగిరెడ్డి, ఆంజనేయులు, రాంప్రసాద్, అమర్‌నారాయణరెడ్డి, బిల్లే రామాంజనేయులు, వెంకట కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ఎస్‌టియు ఆధ్వర్యంలో..

పెనుకొండ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో-60, 61 ఉత్తర్వులు అసమంజసంగా ఉన్నా యని, వాటిని వెంటనే సవరించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఎపి ఎస్‌టిఎ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి.కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మారుతి ప్రసాద్, పి.జయకృష్ణ, వర్కింగ్, అసోసియేట్ ప్రెసిడెంట్స్ సి.నరేష్‌కుమార్, మక్కిశెట్టి కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తక్షణం ఆ ఉత్తర్వులను సవరించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయంగా రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



జెసి మౌర్యభరద్వాజ్‌కు సత్యసాయి చిత్ర పటం అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూల శివప్రసాద్



నూతన జెసిని కలిసిన ఎమ్మెల్యే, ఆర్డీవో

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఇటీవల జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మౌర్యభరద్వాజ్‌ను మంగళ వారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వారు జెసికి సత్యసాయి చిత్రపటాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎమ్మెల్యేగా మా సహకారం ఎప్పుడూ ఉంటుందని, అందరూ కలిసికట్టుగా జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని తెలిపారు. అనంతరం వారు పట్టణంలో పలువురు టిడిపి నాయకులను పరామర్శిం చారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పుట్టపర్తి రూరల్ : జెసి మౌర్య భరద్వాజ్‌ను పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అలాగే ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు జెసిని కలిసి భాకాంక్షలు తెలిపారు.

జెసికి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శుభాకాంక్షలు

కొత్తచెరువు : జెసి మౌర్య భరద్వాజ్‌ను వారి కార్యాలయంలో పుట్టపర్తి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూల శివప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ ఉంచుకునేందుకు కొత్తచెరువు మార్కెట్‌యార్డ్‌లో కోల్డ్ స్టోరేజ్‌లు, గోదాముల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఆయన జెసిని కోరారు. అలాగే ప్రభుత్వం ద్వారా ఎఫ్‌పిఒలకు సబ్సిడీలు అందేలా కృషి చేయాలని కోరారు. ఆయన వెంట జనసేన పుట్టపర్తి టౌన్ కన్వీనర్ సుబ్బరాయుడు, సెక్రటరీ కరుణాకర్, నాయకులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మహేష్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ సబ్ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఆర్డీవో మాట్లాడుతూ సబ్ ప్లాన్, అట్రాసిటీ చట్టం, విద్య, ఉపాధి, తదితర సంక్షేమ పథకాలు, కాలనీల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించామన్నారు. ప్రజా ప్రతినిధులు, నామినేటెడ్ సభ్యులు పలు అంశాలను ప్రస్తావించారన్నారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని అన్ని న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు నారాయణస్వామి, భాస్కర్‌రెడ్డి, స్వర్ణ లత, సురేష్‌బాబు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కొత్తచెరువు : క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల పాఠశాల హెచ్‌ఎం గోపాల్, పిఈటిల సంఘం డివిజన్ కోఆర్డినేటర్ వెంకటేష్ తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం పుట్టపర్తి డివిజన్ అండర్-17 వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో గోరంట్ల విన్నర్స్, కొత్తచెరువు రన్నర్స్, బాలుర విభాగంలో నల్లమాడ విన్నర్స్, గోరంట్ల రన్నర్స్‌గా నిలిచారు. విజేత జట్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో పిఇటిల సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ రామకృష్ణ, పిఈటిలు సూరి, అనురాధ, సుధ, నారాయణమ్మ, గోపీనాథ్, దానమయ్య, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఒడిసి ఉన్నత పాఠశాల నుంచి కె.శరత్‌కుమార్, గౌనిపల్లి ఉన్నత పాఠశాల నుంచి సాయిదర్శిని, చైతన్య జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ గోపీనాథ్, గౌనిపల్లి పిడి జనార్దన్ తెలిపారు. వీరు అనంతపురం న్యూ టౌన్ జూనియర్ కాలేజీలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

నారసింహుని సన్నిధిలో హైకోర్టు జడ్జి

కదిరి టౌన్ : పట్టణంలో వెలసిన ఖాద్రీ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సందర్శించారు. కుటుంబ సమేతంగా వచ్చిన జడ్జికి సోమవారం రాత్రి స్థానిక న్యాయాధికారులు జయలక్ష్మి, లోకనాథం, డీఎస్పీ శివనారాయణస్వామి, తహశీల్దార్ మురళీకృష్ణ, అర్చకులు తూర్పు రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం జడ్జితో పాటు కుటుంబ సభ్యులు శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు. న్యాయమూర్తిని అర్చకులు సత్కరించి శ్రీవారి చిత్రపటాలను బహూకరించారు.

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

కదిరి అర్బన్ : పట్టణంలోని బ్లూమూన్ హైస్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అండర్-17 వాలీబాల్ బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు కోఆర్డినేటర్ లస్కర్ నాయక్ తెలిపారు. బాలుర విభాగంలో ఎన్‌పి.కుంట జట్టుపై అమడగూరు, బాలికల భాగంలో కదిరిపై తలుపుల మండల జట్లు విజయం సాధించాయి. కార్యక్రమంలో బ్లూ మూన్ హైస్కూల్ శివశంకర్, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ సుహాసిని, పిడి హరి, ప్రసాద్, సందీప్, శంకర్‌నాయక్, రవీంద్రనాయక్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

జెసిబి, బైక్ ఢీ.. ఇద్దరు మృతి

ముదిగుబ్బ : మండలంలోని గుంజేపల్లి గ్రామ చెరువుకట్ట సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. బుక్కపట్నం మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన శేషు, క్రిష్ణ సొంత పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తూ గుంజెపల్లి చెరువుకట్ట సమీపంలో జెసిబిని ఢీ కొన్నారు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కి సమాచారం ఇచ్చారు. కానీ అంబులెన్స్ వచ్చే లోపే వారి మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

ఓబుళదేవరచెరువు : మండలంలోని జీరిగుంటపల్లి సమీపంలోని రెయిన్‌బో పాఠశాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దాదిరెడ్డిపల్లికి చెందిన దాదిరెడ్డి సాలెమ్మ మృతి చెందారు. ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సాలెమ్మ ఆమె అల్లుడు మీసాల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై ఒడిసి నుంచి స్వగ్రామం వెళ్తుండగా రెయిన్‌బో పాఠశాల వద్ద బైక్‌పై వచ్చిన గణేష్ వెనుకవైపు నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సాలెమ్మను 108 అంబులెన్స్‌లో కదిరికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సాలెమ్మకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె సంతానం. ఆమె మనవడు భానుప్రకాష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వృద్ధురాలి మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి ..

బత్తలపల్లి : అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండలంలోని బత్తలపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు. గార్లదిన్నె మండలంలోని పాత కల్లూరుకు చెందిన ఓబన్న(60) గత నెల 10వ తేదీ బత్తలపల్లి సమీపంలోని టోల్ ప్లాజా వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడు నెల రోజులకు పైగా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుని కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొన్న బొలెరో.. ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి : అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండలంలోని కట్టకిందపల్లి వద్ద ఆటోను బొలెరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన రమేష్, అతడి బంధువు బళ్లారికి చెందిన నాగరాజు బత్తలపల్లి నుంచి డి.చెర్లోపల్లికి ఆటోలో వెళ్తుండగా కట్టకిందపల్లి వద్ద యూ టర్న్ తీసుకునే సమయంలో కదిరి నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్, నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో బత్తలపల్లికి వస్తున్న డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు నారాయణస్వామి క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ధర్మవరం రూరల్ : వరసకు అన్న అయిన వ్యక్తి పట్టణానికి చెందిన ఓ 17 ఏళ్ల బాలికను గర్భిణిని చేయగా అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సిఐ మంగళవారం తెలిపారు. వివరాలు.. బాలిక తల్లి పనికి వెళ్లిన సమయంలో ఆ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండేది. ఇదే అదునుగా తీసుకున్న ఓ వ్యక్తి బాలికకు మాయమాటలు చెప్పి ఆమె గర్భం దాల్చడానికి కారణమయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీ ఆ బాలిక కడుపు నొప్పిస్తుందని తల్లికి చెప్పగా ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా ఆ బాలిక చనిపోయిన మగ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఆ తల్లి బాలికను తల్లి గట్టిగా విచారించగా అసలు విషయం తెలిపింది. బాలిక ఫిర్యాదు మేరకు చిరంజీవి అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి, అదులోపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితులు అరెస్ట్

హిందూపురం రూరల్ : రూరల్ పరిధిలోని సంతేబిదనూరు పంచాయతీ తుంగేపల్లి గ్రామం వద్ద ఈ నెల 13వ తేదీ జరిగిన హత్యకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ మహేశ్, రూరల్ సిఐ ఆంజనేయులు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హత్యకేసులో నిందితులను అరెస్టు చేసి వారి నుంచి ద్విచక్ర వాహనం, వెండి చైన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారని, కేవలం బైక్, వెండి చైన్ కోసమే పవన్‌ను హత్య చేసినట్లు వెల్లడించారని తెలిపారు.

పేకాటజూదరులు..

లేపాక్షి : పేకాట జూదరులను అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జనార్దన్, ఎస్ఐ నరేంద్ర తెలిపారు. వివరాలు.. మండలంలోని బయన్నపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సిఐ, ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు చేసి ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. అలాగే వారి నుంచి రూ. 34,300 చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో పోలీసులు వెంకటేష్, చెన్నకేశవ, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : మండలంలోని దాడితోటలో పేకాట జూదరులను అరెస్టు చేసి వారి నుంచి నగదు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. దాడితోట గ్రామ నడిబొడ్డున ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ కృష్ణవేణి, పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. 11 మంది పేకాట జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ. 47,755 నగదు, 2 ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'బాలాట' జూదరులు..

ధర్మవరం రూరల్ : ఇటీవల కాలంలో పట్టణ పరిసర ప్రాంతాల్లో 'బాలాట' పేరుతో సరికొత్త జూదానికి తెర తీశారు. ధర్మవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరికీ అనుమానం రాకుండా గుట్టుగా బాలాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సోమవారం బాలాట స్థావరంపై మెరుపు దాడులు చేశారు. 15 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 15,500 నగదు, 11 సెల్‌ఫోన్లు, 17 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు. ధర్మవరం ప్రాంతంలో ఎవరైనా జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

దొంగల ముఠా అరెస్ట్.. 18 బైక్‌లు స్వాధీనం

మడకశిర టౌన్ : వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 8.7 లక్షల విలువ చేసే 18 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. డీఎస్పీ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివ రాలు వెల్లడించారు. రొద్దం మండలానికి చెందిన సురేష్, నరేష్, ఆమిదాలగొంది గ్రామానికి చెందిన సంజయ్ కుమార్, మల్లేష్, డి.అచ్చంపల్లికి చెందిన అనిల్, వడ్డే కుమార్ ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్నాటకలోని వివిధ ప్రాంతాల్లో బైక్ చోరీలకు పాల్పడ్డారన్నారు. ఆయా పోలీస్ స్టేషన్లలో బాధితులు ఫిర్యాదులు చేశారన్నారు. దీంతో మడకశిర అర్బన్ సిఐ సుబ్రహ్మణ్యం దొంగల కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఉదయం కల్లుమర్రి క్రాస్ వద్ద సురేష్, నరేష్ బైక్‌పై వస్తుండగా ఆపి తనిఖీ చేశారు. అనుమానం రావడంతో అదుపులోకి తీసుకొని విచారణ చేయగా నేరాలు అంగీకరించారు. వీరిపై కర్నాటకలోని మధుగిరిలో కేసులు ఉన్నట్లు వెలుగుచూసింది. వీరిచ్చిన సమాచారంతో ఆమిదాలగొంది గ్రామం వద్ద సంజయ్‌కుమార్, మల్లేష్, అనిల్, కుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వారి నుంచి 18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టు హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

సాయం చేస్తానంటూ మోసం

నల్లచెరువు : మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కె.బయప్ప ఇన్‌స్టాగ్రామ్‌లో హర్ష సాయి ఫౌండేషన్ పేరుపై ఉన్న ప్రకటన చూసి వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం పరిస్థితుల దృష్ట్యా ఆర్థిక సాయం అభ్యర్థించారు. దీనిని ఆసరాగా తీసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు బాధితుడు బ్యాంకు ఖాతా నుంచి 4 రోజుల సమయంలో విడతల వారీగా సుమారు రూ. 1.8 లక్షల సొమ్ము కాజేశారు. ఇప్పటికీ ఆర్థిక సాయం చేస్తామంటూ చెబుతున్నారే కానీ ఎలాంటి సాయం చేయలేదన్నారు. చివరకు మోసపోయానని తెలుసుకున్న బయప్ప కదిరి పట్టణంలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.